సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 18 । జూలై । 2024



ఉత్సాహంగా వేట

సముద్రంలో వేట నిషేధం ముగిసిన నెల రోజుల తర్వాత ప్రస్తుతం పెద్ద సంఖ్యలో చేపలు చిక్కుతున్నాయని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸



మళ్లీ ట'మోత'

కొద్ది రోజుల క్రితం వరకూ ఉల్లి ధర ఘాటెక్కిస్తే.. ఇప్పుడు టమాటా వంతు వచ్చింది. కూరగాయల ధరలన్నీ కొండెక్కి కూర్చోగా టమాటా ధర ఆకాశాన్నంటింది. 8లో ▸



జగన్నాథుని రథోత్సవం

లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా జగన్నాథుని రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. 8లో ▸

న్యూస్‌రీల్

ఉత్తమ సేవలందించాలి

ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్



ఐజీ అశోక్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నర్సింహ కిషోర్

ఏలూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఐపీఎస్ అధికారులకు బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు బదిలీపై వచ్చిన పోలీస్ అధికారులు బుధవారం ఏలూరులోని రేంజ్ కార్యాలయంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలను అందించేందుకు తమదైన శైలిలో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి వారి మార్గదర్శకాల మేరకు నేరస్తులకు భయం కలిగేలా సామాన్యులతో స్నేహభావంతో వ్యవహరిస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. ఐజీ అశోక్‌కుమార్‌ను కలిసిన వారిలో కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నర్సింహ కిషోర్, కృష్ణా జిల్లా (మచిలీపట్నం) ఎస్పీ రెడ్డి గంగాధర్ ఉన్నారు.

ఇంజనీరింగ్ అసోసియేషన్లతో కలిసి పనిచేస్తాం




మాట్లాడుతున్న జిల్లా కమిటీ అధ్యక్షుడు రాజేష్

భీమవరం: సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పదోన్నతుల చానల్, రేషనలైజేషన్‌పై వివిధ శాఖలకు సంబంధించిన ఇంజనీర్స్ అసోసియేషన్లతో కలిసి పనిచేయాలని నిర్ణయించినట్టు అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎ.రాజేష్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలపై ప్రభుత్వ ఇంజనీర్స్ అసోసియేషన్లతో రాష్ట్రస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. అనంతరం నరసాపురం డివిజన్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ కె.రమాకాంత్‌ను సత్కరించారు. హౌసింగ్ పీడీ ఎ.పిచ్చయ్య, పంచాయతీరాజ్ డీఈలు గుద్దటి స్వామినాయుడు, బీవీ రమణ, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సాయిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

111 మంది ఎస్సైల బదిలీ

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలోని ఏడు జిల్లాల్లో పనిచేసేందుకు సుమారు 111 మంది ప్రమోటీ ఎస్సైలను బదిలీ చేస్తూ రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు 27 మంది, కృష్ణా జిల్లాకు 23 మంది, ఏలూరు జిల్లాకు 12 మంది, పశ్చిమగోదావరి జిల్లాకు 14 మంది, తూర్పుగోదావరి జిల్లాకు 13 మంది, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 9 మంది, కాకినాడ జిల్లాకు ఏడుగురు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఆరుగురు ప్రమోటీ ఎస్సైలను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఆధార్ అప్‌డేట్‌కు ప్రత్యేక క్యాంపులు



భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో ప్రజలు ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ఈనెల 23 నుంచి 27 వరకు ప్రత్యేక మొబైల్ క్యాంపులు నిర్వహించనున్నట్టు కలెక్టర్ చదవాడ నాగరాణి తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు, పాఠశాలలు, కాలేజీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి పెండింగ్‌లో ఉన్న ఆధార్ సర్వీసులను అప్‌డేట్ చేస్తామన్నారు. ప్రతి మండలంలో ప్రతి రోజూ నాలుగు ప్రాంతాల్లో క్యాంపులు ఏర్పాటుచేస్తామన్నారు. ఆధార్ ఎన్‌రోలెమెంట్, డాక్యుమెంట్, బయోమెట్రిక్ అప్‌డేట్‌లను షెడ్యూల్ ప్రకారం పూర్తిచేస్తామని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. వీరవాసరం ఎస్సీ కాలనీలో యానాది, ఎరుకల కుటుంబాలతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో యానాది, ఎరుకల కుటుంబాలను గుర్తించి ఆధార్ నమోదు చేయించాలని తహసీల్దార్లకు సూచించారు.

ఆడబిడ్డ నిధి.. ఎప్పుడు అందేది?

చంద్రన్నా.. ఇదేంటన్నా

- అధికారంలోకి రాగానే ఆడబిడ్డ నిధి అమలు చేస్తామన్న కూటమి నేతలు
- మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని హామీ
- 19-59 ఏళ్ల మహిళలందరికీ ఇస్తామని ఉమ్మడి మేనిఫెస్టోలో వెల్లడి
- జిల్లాలో 5,96,279 మంది లబ్ధిదారులు
- జగన్ ప్రభుత్వంలో జిల్లాలో మహిళలకు రూ.689 కోట్ల లబ్ధి



జిల్లాలో 5.96 లక్షల మంది అక్కచెల్లెమ్మల ఎదురుచూపులు

సూపర్ సిక్స్

- యువతకు 20 లక్షల ఉద్యోగాలు / నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం
- ప్రతి మహిళకి నెలకు రూ.1500 (19 సం॥ నుంచి 59 సం ॥ వరకు)
- ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

"ఆడబిడ్డల కోసం ఈరోజు ఒక మహాశక్తి కార్యక్రమాన్ని తీసుకువస్తున్నాం. ప్రతి ఒక్క మహిళనూ ఒక మహాశక్తిగా తయారుచేయాలని మా సంకల్పం. కుటుంబ బాధ్యత మీకు అప్పజెప్పాలని నా ఆలోచన. అందుకోసమే ఆడబిడ్డల కోసం 'ఆడబిడ్డ నిధి' పథకం. నెలకు రూ.1,500 మీ అకౌంట్‌కు డైరెక్ట్‌గా వేస్తాం. ఇంట్లో ఇద్దరు ఉంటే ఇద్దరి అకౌంట్లకూ వేస్తాం."

– ఇది 2024 సార్వత్రిక ఎన్నికల సభల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ

సాక్షి, భీమవరం: కూటమి ప్రభుత్వం రావడమే ఆలస్యం ఆడబిడ్డ నిధి పథకం అమలులోకి వస్తుందంటూ ఎన్నికల ప్రచారంలో ఆయా పార్టీల నాయకులు ఊదరగొట్టారు. మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు మీ ఖాతాలకు జమచేస్తామంటూ హోరెత్తించారు. అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటగా పథకం ఎప్పటి నుంచి అమలులోకి వస్తుందోనని మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారు. 19 నుంచి 59 సంవత్సరాల వరకు వయసు గల ప్రతి మహిళకూ ఈ పథకాన్ని వర్తింపజేస్తామని కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నాటికి పశ్చిమగోదావరి జిల్లాలో మహిళా ఓటర్లు 7,51,313 మంది ఉన్నారు.

అర్హులు సుమారు 5.96 లక్షల మంది..

జిల్లాలో వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారులు 1,26,061 మంది ఉండగా వారిలో మహిళలు 60 శాతం మంది ఉంటారని అంచనా. ఈ లెక్కన మహిళా పింఛన్ లబ్ధిదారులు75,636 మంది ఉండగా, వితంతు పింఛన్ లబ్ధిదారులు 49,564 మంది, ఒంటరి మహిళలు 6,926 మంది, అభయహస్తం లబ్ధిదారులు 8,908 మంది, దివ్యాంగులు సుమారు 14వేల మంది కలిపి మొత్తంగా మహిళా పింఛన్ లబ్ధిదారులు 1,55,034 మంది ఉన్నారు. వీరిని మినహాయిస్తే కూటమి మేనిఫెస్టో ప్రకారం.. జిల్లాలో ఆడబిడ్డ నిధి పథకానికి 5,96,279 మంది అర్హులు ఉన్నారని అంచనా. ఈ మేరకు నెలకు రూ.89.44 కోట్ల చొప్పున వారి ఖాతాలకు జమ చేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం రావడమే ఆలస్యం అంటూ ఎన్నికల ముందు ప్రచారం హోరెత్తించిన కూటమి నాయకులు ఇప్పుడు ఆ ఊసెత్తడం లేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి నెలరోజులు దాటింది. వివిధ కార్యక్రమాలపై సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటి నుంచి అమలుచేస్తారు.. ఆ పథకానికి సంబంధించిన విధివిధానాలేంటి.. పింఛన్ల మాదిరి ఏప్రిల్ నుంచి సాయం అందిస్తారా.. అనే అంశాలపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. దీంతో కూటమి ప్రభుత్వం తీరు అక్కచెల్లెమ్మలను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. త్వరితగతిన పథకాన్ని అమలులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మహిళలంతా కోరుతున్నారు.

గత జగన్ ప్రభుత్వంలో జిల్లాలో మహిళలకు అందించిన సాయం

వైఎస్సార్ చేయూత పథకం

సంవత్సరం	లబ్ధిదారులు	సాయం (రూ.కోట్లలో)
2020-21	51,516	97.00
2021-22	51,000	96.00
2022-23	70,212	131.15
2023-24	74,274	139.26

వైఎస్సార్ కాపు నేస్తం

సంవత్సరం	లబ్ధిదారులు	సాయం (రూ.కోట్లలో)
2020-21	24,199	36.30
2021-22	21,815	32.72
2022-23	31,361	47.04
2023-24	34,642	51.96

ఈబీసీ నేస్తం

సంవత్సరం	లబ్ధిదారులు	సాయం (రూ.కోట్లలో)
2021-22	11,997	17.99
2022-23	13,460	20.19
2023-24	13,024	19.53

హామీలన్నీ అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలులోకి తేవాలి. మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ విషయమై ఇప్పటివరకు ఎలాంటి పురోగతీ లేదు. ఇప్పటికే తల్లికి వందనం పథకం అమలులో క్లారిటీ లేదు. దీంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్, నరసాపురం

ఇప్పటికీ స్పష్టత లేదు



కూటమి ప్రభుత్వం వచ్చి అప్పుడే నెల రోజులు దాటింది. అధికారంలోకి రాగానే ఆడబిడ్డ నిధి పథకం అమలుచేస్తామన్నారు. ఇప్పటివరకూ దానిపై స్పష్టత లేదు. గత ప్రభుత్వపు అమ్మఒడి పథకాన్ని కాపీ కొట్టి తల్లికి వందనంగా పేరు మార్చారు. ఇంటిలో పిల్లలందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు దానికీ స్పష్టత లేని జీఓను విడుదల చేశారు.

– కర్రా జయసరిత, న్యాయవాది, పాలకొల్లు

జగన్ ప్రభుత్వంలో మహిళలకు మేలు

సామాజికవర్గాలకు అతీతంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద మహిళలకు వెన్నుదన్నుగా నిలిచారు నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించారు. 45 నుంచి 60 ఏళ్ల వయసులోపు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున జిల్లాలో సగటున 61,750 మందికి నాలుగేళ్లలో రూ.463.41 కోట్ల సాయాన్ని నేరుగా వారి ఖాతాలకు జమ చేశారు. అలాగే కాపు నేస్తం పథకం కింద కాపు, బలిజ, ఒంటరి, తెలగ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 28,004 మంది మహిళలకు నాలుగేళ్లలో రూ.168.02 కోట్లు అందజేశారు. ఈబీసీ నేస్తం పథకం కింద రెడ్డి, కమ్మ, క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్య తదితర ఓసీ సామాజికవర్గాల్లోని 12,827 మంది మహిళలకు రూ.57.71 కోట్ల సాయం అందించారు.

నిత్యావసరాల విక్రయం.. నామమాత్రం

- అక్కరకు రాని ప్రభుత్వ కేంద్రాలు
- జిల్లాలో 21 ప్రాంతాల్లో బియ్యం, కందిపప్పు అమ్మకాలు
- వెలవెలబోతున్న దుకాణాలు
- అంతంతమాత్రంగా విక్రయాలు
- ఆసక్తి చూపని వినియోగదారులు



భీమవరం రైతు బజార్‌లో ఏర్పాటుచేసిన బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రం

భీమవరం: మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో పేద, మధ్యతరగతి వర్గాలు బెంబేలెత్తుతున్నాయి. సరుకులతో పాటు కూరగాయల ధరలూ ఇబ్బంది పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో సరసమైన ధరలకు నాణ్యమైన సరుకుల అమ్మకం అంటూ ప్రభుత్వం ప్రారంభించిన ప్రత్యేక కేంద్రాలకు ఆదరణ కరువైంది. ప్రభుత్వం విక్రయిస్తున్న బియ్యం, కందిపప్పు ధరలకు.. బహిరంగ మార్కెట్‌లో ధరలకూ పెద్దగా తేడా లేకపోవడంతో పాటు, ప్రభుత్వ దుకాణాల్లోని సరుకుల నాణ్యత తక్కువగా ఉందని వినియోగదారులు అంటున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. కందిపప్పు కిలో రూ.220 వరకు పెరగ్గా, బియ్యం నాణ్యతను బట్టి కిలో రూ.70 వరకు విక్రయించారు. చింతపండు, ఎండుమిర్చి ధరలు పైపైకి వెళ్లాయి. కూటమి అధికారంలోనికి వస్తే ధరలు తగ్గిస్తామంటూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ వినియోగదారుల నుంచి డిమాండ్ పెరిగింది. దీంతో ప్రభుత్వం పౌరసరఫరాశాఖ ద్వారా బియ్యం, కందిపప్పు తక్కువ ధరకు విక్రయించనున్నట్టు ప్రకటించింది. దీనిలో భాగంగా జిల్లాలో భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, అత్తిలి, ఆకివీడు, పెనుగొండ ప్రాంతాల్లో రైతు బజార్, డి-మార్టు, రిలయన్స్, స్పెన్సర్స్, విక్టరీ బజార్, చాంబ ఆఫ్ కామర్స్, మోర్, విజేత, ఆర్యవైశ్య కల్యాణమండపం వంటి ప్రాంతాల్లో దాదాపు 21 విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని ఈనెల 11న ఆయా ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు అట్టహాసంగా ప్రారంభించారు.

62 క్వింటాళ్ల బియ్యం.. 22 క్వింటాళ్ల కందిపప్పు

జిల్లాలోని 21 విక్రయ కేంద్రాల్లో ఇప్పటివరకు సుమారు 62 కింటాళ్ల బియ్యం, 22 కింటాళ్ల కందిపప్పు మాత్రమే విక్రయించడాన్ని చూస్తే ప్రజల్లో వీటికి ఆదరణ ఎలా ఉందో అర్థమవుతుంది. ఇందుకు ప్రధాన కారణం ప్రభుత్వం విక్రయిస్తున్న ధరలకు, బహిరంగ మార్కెట్‌లో ధరలకు పెద్దగా తేడా లేకపోవడం, అలాగే ప్రభుత్వ కేంద్రాల్లోని బియ్యం, కందిపప్పు నాణ్యత కూడా అంతంతమాత్రంగా ఉండటమేనని పలువురు అంటున్నారు. ప్రభుత్వం కిలో కందిపప్పు రూ.160, స్టీమ్డ్ బీపీటీ బియ్యం కిలో రూ.49, పచ్చి బియ్యం బీపీటీ కిలో రూ.48లకు విక్రయిస్తుండగా.. బహిరంగ మార్కెట్ లో నాణ్యమైన నాగపూర్ కందిపప్పు కిలో రూ.170, స్వర్ణరకం బియ్యం కిలో రూ.40, సోనామసూరి కిలో రూ.50 లభిస్తుండటంతో ప్రజలు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలుకే మక్కువ చూపుతున్నారు. అలాగే ప్రభుత్వ విక్రయ కేంద్రాల్లో తక్షణం సొమ్ము చెల్లించాల్సి ఉండగా.. మార్కెట్‌లో వ్యాపారుల వద్ద అరువు పద్ధతి ఉండటంతో అటుగా వెళుతున్నారు. ధరల్లో వ్యత్యాసం లేకపోవడం వల్ల ప్రభుత్వ కేంద్రాలను ఏర్పాటుచేసినా ప్రయోజనం లేదని, ఇందుకే ఆదరణ నామమాత్రంగా ఉందని తెలుస్తోంది. ఇప్పటికే కొన్నిచోట్ల ప్రభుత్వ కేంద్రాల దుకాణాలు మూతపడటం విశేషం.

చట్టవ్యతిరేక చర్యలను

ఉపేక్షించం

ఎస్పీ నయీమ్ అస్మి



భీమవరం: జిల్లాలో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి హెచ్చరించారు. జిల్లా ఎస్పీగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పోలీసుశాఖ చట్టపరిధిలో పనిచేస్తుందని ప్రధానంగా మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. పిల్లలు, మహిళలపై జరిగే దాడులు, నేరాల్లో నిందితులకు త్వరితగతిని ట్రయిల్ నిర్వహించి కోర్టులో శిక్షపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో గంజాయిని సమూలంగా అరికట్టడానికి గంజాయి సేవించే, విక్రయించే, రవాణా చేసే వారిపై ప్రత్యేక నిఘా పెడతామని, వాటి మూలాలను గుర్తించి పూర్తిగా అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్స్‌పై నిరంతరం నిఘా ఉంటుందని నేరాలు, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూస్తామని రౌడీషీటర్స్ పరిధి దాటి ప్రవర్తిస్తే పీడీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ క్రైమ్‌కు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక అమలుచేసి కట్టడికి కృషి చేస్తామన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అడిషినల్ ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం డీఎస్పీలు వి.నారాయణస్వామిరెడ్డి, జి.శ్రీనివాసరావు, డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాద మరణాలపై కలెక్టర్ సీరియస్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో సంభవిస్తున్న విద్యుత్ ప్రమాదాల మరణాల సంఘటనలపై కలెక్టర్ వెట్రి సెల్వి తీవ్రంగా స్పందించారు. విద్యుత్ ఎస్ఈ, డివిజనల్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ల తో బుధవారం ఆమె నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో విద్యుత్ ఎస్ఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ అంతరాయం, బ్రేక్‌డౌన్‌లు, తీగలు చేతికందేలా ఉన్నాయని వస్తున్న వార్తలపై స్పందించకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఎస్ఈ తమ వద్ద 270 మంది సిబ్బంది ఉన్నారని చెప్పగా వారంతా రోజూ పనిచేయడం లేదా అని ప్రశ్నించారు. వారంలోపు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ లైన్ల వరకూ అన్నింటినీ సరిచేసి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని, పనుల నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాల్లో ఇకపై ఎవరైనా చనిపోతే షోకాజ్ నోటీసులు ఇవ్వడం ఉండదని, డైరెక్టుగా తీసేయడమేనని కలెక్టర్ హెచ్చరించారు.

ఫిర్యాదుల వెల్లువ : సార్వత్రిక ఎన్నికల అనంతరం ప్రజాప్రతినిధులంతా బిజీగా ఉండటంతో విద్యుత్ సంస్థపై దృష్టి పెట్టకపోవడం వల్ల విద్యుత్ సిబ్బంది, అధికారుల్లో నిర్లక్ష్యం పెరిగిపోయిందని, ఏలూరు సర్కిల్ పరిధిలో ప్రజల ఫిర్యాదులను పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయడం లేదని ఆ సంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ముఖ్యంగా భీమవరం డివిజన్ పరిధిలో చేతికి అందేలా విద్యుత్ తీగలు ఉన్నా, లూజ్ లైన్లు తెగిపోయి కిందకు వేలాడుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. సెక్షన్‌లో పెట్రోలింగ్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఫీల్డ్ సిబ్బంది పనులను ప్రైవేట్ వర్కర్లతో చేయిస్తున్నారనే ఫిర్యాదులు కూడా అందాయి. ప్రధానంగా ఆకివీడు, చింతలపూడి, నరసాపురం, నిడదవోలు తదితర సబ్ డివిజన్ల అధికారులు మామూళ్ల మత్తులో తూగుతున్నారని, చేపల, రొయ్యల చెరువులకు విద్యుత్ కనెక్షన్ కావాలంటే కిలో వాట్‌కి రూ.1,500 చొప్పున దండుకుంటున్నారనే ఆరోపణలు ఎక్కువయ్యాయి.

కోటి పుణ్యాల రాశి.. తొలి ఏకాదశి





తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం భక్తజన సంద్రమైంది. బుధవారం వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం వరకూ రద్దీ కొనసాగింది. భజన మండళ్ల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాత్రి తొళక్క వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ నేత్రపర్వంగా సాగింది.

– ద్వారకాతిరుమల

మొహర్రం.. భక్తి పరవశం



మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని ఏలూరులోని పంజాలు, ఆస్థానాల వద్ద బుధవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేసి పీర్లను పూలతో అలంకరించి ఊరేగించారు. పీర్ల పంజా కమిటీ ఆధ్వర్యంలో మేళతాళాలతో ఊరేగింపులు జరిగాయి. పీర్లను పాతబస్టాండు సమీపంలోని కర్బలా మైదానంలో నిమజ్జనం చేశారు.

– ఏలూరు (ఆర్ఆర్‌పేట)

క్లుప్తంగా

బోరు నుంచి పెల్లుబికిన గ్యాస్


కానుపోతుగుంటలో బోరును పూడ్చుతున్న ఓఎన్జీసీ అధికారులు

పెనుగొండ : ఆచంట శివారు కానుపోతుగుంటలో పరిసర ప్రాంత ప్రజలను బోరు హడలెత్తించింది. మంగళవారం రాత్రి వింత శబ్దాలతో గ్యాస్ బయటకు రావడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. వీఆర్వోకు సమాచారం అందించడంతో పాలకొల్లు అగ్నిమాపక కేంద్రానికి, ఓఎన్జీసీ అధికారులకు ఫిర్యాదు చేసారు. దీంతో సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని బోరును తాత్కాలికంగా మూసివేశారు. బుధవారం మరోసారి పరిశీలించి ఇసుక వంటి వాటితో బోరును పూర్తిగా మూసివేశారు. బండి వెంకట కృష్ణ గతంలో 180 అడుగుల వరకూ బోరు వేయించారు. మూడేళ్ల పాటు నీరు వచ్చి ఆగిపోవడంతో బోరు నిరుపయోగంగా మారింది. దీంతో 10 సంవత్సరాలుగా వదిలివేశారు. గతంలోనూ ఇదే ప్రాంతానికి చెందిన బండి ఏసోబు చేతి పంపు నుంచి మంటలు వ్యాపించాయి.

ఏపీఆర్‌సెట్‌లో జిల్లా వాసికి ఫస్ట్ ర్యాంక్


2024లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన జి.అనిల్ కుమార్

సాక్షి, భీమవరం: ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఇటీవల వెల్లడించిన ఏపీఆర్‌సెట్ పరీక్షా ఫలితాల్లో పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం కోరుకొల్లు గ్రామానికి చెందిన బూసి అనిల్ కుమార్ మొదటి ర్యాంకు సాధించారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని ఓ విద్యాసంస్థలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. విశాఖపట్నంలో వీఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేసిన ఆయన ఎంఎస్సీ (రసాయన శాస్త్రం) భీమవరంలో పూర్తి చేశారు. కాన్పూర్‌లో ఐఐటీ పూర్తి చేశారు. ఫస్ట్ ర్యాంక్ సాధించడం పట్ల అనిల్‌కుమార్ కుటుంబసభ్యులు, సన్నిహితులు అభినందనలు తెలిపారు.

మహిళపై దాడి

ఉండి: తన సంపాదనతో నిర్మించిన ఇంట్లోకి తనను రానివ్వకుండా కొట్టి తరిమేశారంటూ ఓ మహిళ తన తండ్రి, సోదరుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. యండగండి గ్రామానికి చెందిన దండే మరియమ్మ గత 20 ఏళ్ల నుంచి గల్ఫ్ దేశంలో పనిచేసింది. అక్కడ్నించి తన సంపాదనలో కొంత మొత్తాన్ని ప్రతి నెలా తండ్రి దిడ్ల ముత్యాలుకు పంపింది. ఈ సొమ్ముతో తన కోసం గ్రామంలో తమ్ముడు దిడ్ల చినవెంకన్న ఇల్లు కడుతున్నట్లు తండ్రి ఆమెతో చెప్పాడు. అయితే గల్ఫ్ దేశం నుంచి తిరిగి వచ్చిన ఆమెతో ఇది నీ ఇల్లు కాదని, ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని తండ్రి, తమ్ముడు కలిసి ఆమెను కొట్టి, తిట్టి తరిమేశారు. మరియమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా వేట

- నెల రోజులుగా చేపలు చిక్కక నిరుత్సాహంలో మత్స్యకారులు
- గత నాలుగు రోజులుగా పుంజుకున్న వేట


గోదావరిలో వేట కోసం వల కట్లు కడుతున్న మత్స్యకారులు

నరసాపురం: సముద్రంలో వేట నిషేధం ముగిసిన నెల రోజుల తర్వాత ఇప్పుడు పెద్ద సంఖ్యలో చేపలు చిక్కుతున్నాయని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు సముద్రంలో వేట నిషేధం అమలు చేశారు. ఆ తరువాత వేట ప్రారంభించిన మత్స్యకారులకు సముద్రం, గోదావరిలో ఆశించిన మేర చేపలు చిక్కలేదు. చేపల వేట నిషేధ సమయంలో చాటుమాటుగా కొందరు వేట కొనసాగించడంతో చేపల గుడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని మత్స్యకారులు గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గత 30 రోజులుగా గంటల తరబడి వేట కొనసాగించినా కొద్ది మొత్తంలోనే చేపలు తమ వలలకు చిక్కాయని మత్స్యకారులు వాపోయారు. నాలుగైదు రోజుల నుంచి మాత్రం సముద్రంతో పాటు గోదావరిలోను వలలకు పెద్ద సంఖ్యలో చేపలు చిక్కుతున్నాయని మత్స్యకారులు సంబరంగా ఉన్నారు.

వలలకు చిక్కుతున్న పండు చేప, మత్స్యగొరకలు

దీంతో ఒక్కసారిగా మత్స్యకారులంతా రెట్టించిన ఉత్సాహంతో లంగరుకే పరిమితమైన నావలు, వలలు, ఇతర వేట పరికరాలతో వేటను మళ్లీ ప్రారంభించారు. గోదావరి నదిలో వలకట్ల వద్ద వందల సంఖ్యలో నావల్లో మత్స్యకారులు చేపల వేటను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం గోదావరిలో అరుదుగా దొరికే పండు చేప, మత్స్యగొరకలు, సొటారులు, రొయ్యలు, కోళ్ల దాణాగా వినియోగించే గొట్టు చుక్క రకం చేపలు ఎక్కువగా దొరుకుతున్నాయని చెబుతున్నారు. దీంతో మత్స్యకార కుటుంబాల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. గోదావరి నుంచి వేటాడి తీసుకువచ్చిన పలు రకాల చేపలను ఆరబెట్టి నిల్వ చేసే పనిలో మత్స్యకార కుటుంబాల్లోని మహిళలు ఉత్సాహం చూపుతున్నారు. మొత్తం కుటుంబమంతా ఇదే పనిలో ఉంటున్నారు.

పులసల సీజన్‌తో ఉత్సాహం

పులస సీజన్ ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతోంది. గోదావరిలోకి బురద నీరు ప్రవేశించగానే సముద్రంలో ఉన్న ఇలస చేపలు ఒక్కొక్కటిగా గోదావరి వైపు ఈదుతూ వస్తున్నాయని పలువురు మత్స్యకారులు చెబుతున్నారు. ఇలస గోదావరి ఎర్రనీటిలోకి వచ్చే సరికి పులసగా మారుతుందని అంటారు. అడపాదడపా వలల్లో ఒకటి, రెండు పులస చేపలు కనిపిస్తున్నాయని గంగపుత్రులు ఆనందంగా చెప్పారు. మరో వారం పది రోజులు గడిస్తే పులసల ఉనికి ఎక్కువగా కనిపిస్తుంది.

ఈ ఊపు కొనసాగాలి



గత నెల రోజులుగా గోదావరిలో చేపలు లేక ఆందోళనచెందాం. వేట ఆరంభమైనా పెద్దగా చేపలు వలలకు చిక్కలేదు. దీంతో రోజుకు రూ.200 కూడా సంపాదించలేని పరిస్థితి. గత నాలుగు రోజులుగా పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. వేటకు వెళితే భారీగా చేపలు వలలో పడుతున్నాయి. ఇదే ఊపు కొనసాగాలని గోదారమ్మను వేడుకుంటున్నాం.

పెమ్మాడి నాగరాజు, మత్స్యకార్మికుడు, నరసాపురం

మళ్లీ ట'మోత'

బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.90



నూజివీడు: కొద్ది రోజుల క్రితం వరకూ ఉల్లి ధర ఘాటెక్కిస్తే.. ఇప్పుడు టమాటా వంతు వచ్చింది. ఇప్పటికే కూరగాయల ధరలన్నీ కొండెక్కి కూర్చోగా టమాటా ధర ఆకాశాన్నంటింది. నూజివీడు రైతుబజారులో కిలో రూ.70లకు అమ్మగా బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.90కు విక్రయిస్తున్నారు. గ్రామాల్లో రూ.100 వరకు ధర పలుకుతోంది. దీంతో ప్రజలు కిలో కొనాల్సిన చోట పావు కిలో కొని సరిపెడుతున్నారు. ఇంత ధర పలుకుతుండటంతో రైతుబజారులోని దుకాణదారులు కూడా అమ్మకాలను తగ్గించేశారు. నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి తదితర ప్రాంతాల్లో టమాటా సాగు లేకపోవడంతో కావాల్సిన టమాటాను హోల్‌సేల్ వ్యాపారులు చిత్తూరు జిల్లా మదనపల్లి ప్రాంతం నుంచి కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. దీంతో టమోట ధర ఎక్కువగా ఉందని కూరగాయల వ్యాపారులు పేర్కొంటున్నారు. 25 కిలోల టమాటా బాక్సును రూ.2 వేలకు కొనుగోలు చేసినట్లు దుకాణదారులు చెప్పారు. టమాటా ధర మామూలుగా ఉన్నప్పుడు నూజివీడు రైతుబజారులో రోజుకు 2 టన్నుల వరకు అమ్ముడుబోయేది. ధర పెరిగిన నేపథ్యంలో టన్ను కూడా అమ్ముడుకావడం లేదని దుకాణదారులు చెబుతున్నారు. టమాటా ధర ఆకాశాన్నంటుతున్నా ధర తగ్గించేందుకు ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇలాగైతే టమాటా కొనలేం



టమాటా ధర భారీగా పెరిగింది. నిన్నమొన్నటి వరకు రూ.40 వరకు ఉన్న టమోట కిలో ధర నేడు రెట్టింపై రూ.90కు చేరింది. దీంతో టమాటా కొనడం మానేశా. ఇంత భారీగా ధర ఉండడంతో ఏం తినాలో తెలియడం లేదు. టమాటా ధరను తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

– బెజవాడ రాణి, పోతురెడ్డిపల్లి, నూజివీడు

ఇంత ధర పెరిగితే ఏం తినాలి



టమాటా కొందామని మార్కెట్‌కు వెళ్తే రూ.90 చెప్పారు. దీంతో టమోట కొనడమే మానేశాం. టమాటాతో పాటు ఇతర కూరగాయల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ధరలు ఇలా పెరిగితే పేదలు పచ్చడి మెతుకులకే పరిమితం కావాలేమో.

– బొల్లిపాం అరుణకుమారి, నూజివీడు

శ్రీవారి పథకాలకు విరాళాలు


దాత శేషుబాబు దంపతులకు శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ ఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదానం, విమాన గోపుర స్వర్ణమయ పథకాలకు బుధవారం విరాళాలు వెల్లువెత్తాయి. ఎనిమిది మంది భక్తులు వేర్వేరుగా రూ. 8.01 లక్షలను విరాళంగా అందజేశారు. అందులో భాగంగా విమానగోపుర స్వర్ణమయ పథకానికి కడియంకు చెందిన సుబ్రహ్మణ్య నాగ శేషబాబు, సుహాసిని దంపతులు రూ. 1,00,116, దొమ్మేరుకు చెందిన డి.చంద్రమౌళి, హేమలత దంపతులు రూ. 1,00,116, రాజమండ్రికి చెందిన రామాజీ, ఉషారాణి దంపతులు రూ.1,00,116, కడియంకు చెందిన సీహెచ్ దుర్గాప్రసాద్, రమాదేవి దంపతులు రూ.1,01,116, నిడదవోలుకు చెందిన డాక్టర్ పోతుల పవన్ కిషోర్, ఆరతి దంపతులు రూ.1,00,116, జంగారెడ్డిగూడెంకు చెందిన పోతుల గణేశ్వర శ్రీనివాస వరప్రసాద్, గిరిజ దంపతులు రూ.1,00,116, అలాగే నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నంకు చెందిన కిమిడి మోహనరావు రూ.1,00,000, జంగారెడ్డిగూడెంకు చెందిన పామర్తి వేంకటేశ్వరరావు రూ.1,00,116 వెరసి రూ. 8,01,812 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథ రావు, ఏఈఓ ఎం.దుర్గారావులు విరాళం బాండ్ పత్రాలను, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఎర్రకాలువలో ఇసుక మాఫియా

ఇష్టానుసారంగా అక్రమ రవాణా



కొయ్యలగూడెం మండలం రాజవరం సమీపంలోని ఎర్రకాలువ నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న ఇసుక

కొయ్యలగూడెం: తోలుకో.. దండుకో.. అడిగేవాడు ఎవడు? అనుకుంటూ ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కొద్దిరోజులుగా తమ దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇందుకు ఎర్రకాలువ పరీవాహక ప్రాంతాలు అడ్డాగా మారాయి. కాలువలు, వాగుల్లో ఉన్న ఇసుక రవాణాపై ప్రభుత్వ వైఖరిలో స్పష్టత లేకపోయినప్పటికీ ఇసుక అక్రమ రవాణాకు కూటమి నాయకులు తెర దీశారు. దీంతో ఏలూరు జిల్లా కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల మీదుగా వెళ్లే ఎర్ర కాలువలోని ఇసుకను రాత్రి వేళల్లో భారీగా జేసీబీలను ఏర్పాటు చేసి ట్రక్కుల ద్వారా తరలించుకుపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం లేదు. మరికొన్ని చోట్ల చర్యలు తీసుకునేందుకు వెళ్లిన అధికారులపై పాలక పక్షాల నాయకుల ఒత్తిడి చేయడంతో మిన్నకుండిపోతున్నారని చెబుతున్నారు. ఇసుక రవాణా చేస్తున్నవారు నిర్మాణ రంగాలకు సంబంధించిన వర్గాల వారు కాకపోవటం గమనార్హం. మున్ముందు విధివిధానాలు ఏ విధంగా ఉంటాయోనని, దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవడం మంచిదనే అభిప్రాయంతో ఇసుక దళారులు అక్రమంగా ఇసుకను తరలించి ప్రైవేటు స్థలాలలో డంపింగ్ చేస్తున్నారని కొందరు పేర్కొంటున్నారు. ఐఎస్ రాఘవాపురం, ఐఎస్ జగన్నాథపురం, గంగవరం, మంగపతిదేవిపాలెం, పోతిరెడ్డిపాలెం, పోతవరం పరిసర ప్రాంతాల్లో ఇసుకను భారీగా డంప్ చేశారని చెబుతున్నారు. సొంత ఇళ్ల నిర్మాణదారులకు ఇసుక అవసరమయ్యే సమయానికి కాలువలు, వాగుల్లో ఉండే ఇసుక ఖాళీ అయితే నిజమైన అర్హులకు అన్యాయమే జరుగుతుందని, దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని భవన నిర్మాణ కార్మికుల అసోసియేషన్ నాయకుడు పి.ప్రభుదాస్ కోరుతున్నారు.

పంచాయతీ కార్యాలయానికి పసుపు రంగు


చింతలపూడి మండలం మల్లాయిగూడెం పంచాయతీ కార్యాలయానికి పసుపు రంగు వేసిన దృశ్యం

చింతలపూడి: రాష్ట్రంలో తెలుగు తమ్ముళ్ల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముగిసిన వెంటనే ఏలూరు జిల్లా చింతలపూడి మండలం, మల్లాయగూడెం గ్రామ పంచాయితీ కార్యాలయానికి తెలుగు తమ్ముళ్లు పసుపు రంగు వేశారు. పంచాయతీ కార్యాలయానికి పసుపు రంగు వేయడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై రంగుల విషయంలో టీడీపీ నేతలు నానా యాగీ చేసిన విషయం తెలిసిందే. ఆఖరికి కోర్టులో కేసులు వేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రంగులు వేయడాన్ని తప్పు పట్టిన టీడీపీ అధికారంలోకి రాగానే పసుపు రంగు వేయడం ఏంటని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై అధికారులను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

కమనీయం.. జగన్నాథుని రథోత్సవం


రథయాత్రలో కోలాట భజనలు, ఇస్కాన్ గురువులు


రథంలో కొలువైన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుని దారు విగ్రహాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జగన్నాథుని దివ్య రథోత్సవం బుధవారం సాయంత్రం కన్నులపండువగా జరిగింది. ఈ వేడుకతో ఆలయంలో ఈనెల 7 నుంచి జరుగుతున్న రథయాత్ర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ముందుగా ఆలయం వద్ద రథాన్ని విశేష పుష్పామాలికలు, మామిడి తోరణాలు, అరటిబోదెలతో శోభాయమానంగా అలంకరించారు. ఆ తరువాత అర్చకులు సుభద్ర, బలభద్ర, జగన్నాథుని దారు విగ్రహాలను ఆలయం నుంచి తీసుకొచ్చి, రథంలో వేంచేపు చేశారు. అనంతరం విశేష పుష్పాలంకారాలు, పూజాదికాలను నిర్వహించారు. ఆలయ అధికారులు రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, బలిహరణను సమర్పించారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట భజనలు, ఇస్కాన్ గురువుల గీతాలాపనల నడుమ జగన్నాథుని రథం సమీప గ్రామమైన తిమ్మాపురానికి తరలివెళ్లింది. అక్కడి నుంచి తిరిగి రాత్రికి ఆలయానికి చేరుకుంది. అధిక సంఖ్యలో భక్తులు ఈ రథోత్సవ వేడుకలో పాల్గొన్నారు. ఆలయ మండపంలో జగన్నాథ స్వామివారు శ్రీ వేంకటేశ్వర స్వామివారి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవారికి సారె సమర్పణ

జగన్నాథ రథయాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని తిమ్మాపురం గ్రామస్తులు సుభద్ర అమ్మవారికి ఉదయం సారెను సమర్పించారు. పట్టుచీర, పూలు, పండ్లు, గాజులు, పసుపు కుంకుమలను సారెగా ఆలయ అర్చకుడు గోపీకి అందజేశారు. ఈ సందర్భంగా వాటిని ఆలయంలో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుని దారు విగ్రహాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాళ్ల సత్యనారాయణ (49)

యలమంచిలి: చించినాడ బైపాస్‌రోడ్డులో కాజ వద్ద ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. యలమంచిలి ఎస్సై కాకి శివన్నారాయణ తెలిపిన వివరాల ప్రకారం దేవరపల్లి గ్రామానికి చెందిన కాళ్ల సత్యనారాయణ(49) నరసాపురంలో ఉంటున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మోరి గ్రామంలో ఓఎన్జీసీ షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులిచ్చిన సమాచారంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై బ్లేడ్‌తో దాడి

నూజివీడు: పట్టణంలోని బాపూనగర్‌కు చెందిన కొడవటి సంజయ్‌పై అదే ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు బుధవారం బ్లేడ్‌తో దాడి చేశారు. క్షతగాత్రుడి ఫిర్యాదు ప్రకారం.. ఆ యువకులు గంజాయి తీసుకురమ్మని మంగళవారం రాత్రి సంజయ్‌కు చెప్పారు. సంజయ్ తీసుకురావడానికి నిరాకరించాడు. దీంతో అతనిని ఆ రాత్రి కొట్టడంతో పాటు బుధవారం ఉదయం ముగ్గురు యువకులు బ్లేడ్‌తో దాడి చేసి గాయపరిచారు. సంజయ్‌కు చేతులపై తెగడంతో చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి నుంచి పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు.

ఇసుక అక్రమ రవాణా

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేటలోని ఇసుక స్టాక్ పాయింట్ నుంచి రెండు రోజులుగా పదుల సంఖ్య లారీల్లో ఇసుకను లోడ్ చేసి అక్రమంగా తరలిస్తున్నారు. చింతలపూడి తరలిస్తున్నామన్న పేరుతో తెలంగాణ మీదుగా అక్రమ రవాణా చేస్తున్నట్టు తెలుస్తుంది.

మురికిగుంటలో పడి వ్యక్తి మృతి

కైకలూరు: మూర్ఛ వ్యాధి కారణంగా మురికి కాల్వలో పడి వ్యక్తి మృతి చెందాడు. కలిదిండి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కోరుకొల్లు గ్రామానికి చెందిన పాతపాటి రమేష్ అలియాస్ జోజి(45) కులీ పనులు చేస్తాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి రమేష్ కనిపించలేదు. గాలించిగా బుధవారం ఉదయం ఇంటి సమీపంలోని మురికి కాల్వలో పడి చనిపోయి ఉన్నాడు. మూర్ఛ వ్యాధితో రమేష్ బాధపడుతున్నాడని బంధువులు చెప్పారు. కుమారుడు ఏసురాజు ఫిర్యాదుపై కలిదిండి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏలూరులో మహిళలపై దౌర్జన్యం


ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు గురుకుపల్లి లక్ష్మి

ఏలూరు టౌన్: ఏలూరు ఆముదాల అప్పలస్వామి కాలనీలో ఇద్దరు మహిళలపై టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి దాడి చేసినట్లు బాధిత మహిళలు తెలిపారు. ఇంట్లో నుంచి బయటకు లాక్కొచ్చి ఇటుకలతో దాడి చేయడంతో వారిద్దరికీ గాయాలయ్యాయి. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో బాధితులు చికిత్స పొందుతున్నారు. బాధితులు చింతాడ వెంకటరమణ, గురుగుపల్లి లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు ఆముదాలఅప్పలస్వామి కాలనీకి చెందిన నక్కా వరప్రసాద్ అతని మేనల్లుడు రాజేష్‌లు కొందరు వ్యక్తులను తమ ఇంటిపైకి పంపారని, ఇంట్లో మగవాళ్లు లేని సమయంలో బయటకు లాక్కొచ్చి కొట్టారని ఆరోపించారు. 10 ఏళ్ళ క్రితం కొన్ని గొడవలు జరిగాయని, పాత కక్షల నేపథ్యంలోనే దాడి చేశారని చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ఉండటానికి వీల్లేదని, చంపుతామని బెదిరిస్తున్నారంటూ బాధిత మహిళలు తెలిపారు. తమకు ప్రాణహాని ఉందనీ, పోలీస్ అధికారులు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సంఘటనపై ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వృద్ధురాలు లక్ష్మీకి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారని ఆమె కుమారుడు రాంబాబు తెలిపారు. తాను ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఉండగా, ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తున్నాననే కక్షతో దాడులకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. ఈ గొడవలకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదని చెప్పారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

పాలకొల్లు అర్బన్: మండలంలోని శివదేవునిచిక్కాలకు చెందిన 19 సంవత్సరాల యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యువతి ఇంటర్ వరకు చదువుకుని ఇంటివద్దే ఉంటుంది. ఈ క్రమంలో ఈ నెల 10న రాత్రి 8 గంటల సమయంలో సుహాసిని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికామని, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాయుడు చంద్రశేఖర్, ఎస్‌వో రాముడు, పెద్దిరాజులపై అనుమానం ఉందని యువతి తండ్రి ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.హరికృష్ణ తెలిపారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. బాధిత బాలిక వెంటపడుతూ ఫోన్‌కు అసభ్యకరంగా పోస్టులను పంపిస్తూ వేధిస్తున్నాడన్నారు. టి.నర్సాపురానికి చెందిన ఆ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

భీమవరం: అదనపు కట్నం కోసం తన భర్త, అతని బంధువులు వేధిస్తున్నట్లు నర్సయ్య అగ్రహారానికి చెందిన కె.జయకుమారి ఫిర్యాదు చేసింది. తనకు 2019లో వివాహమైందని ఆ ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలు జయకుమారి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.మాణిక్యమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో దాడి

పాలకొల్లు సెంట్రల్: మద్యం మత్తులో ఓ వ్యక్తిపై మందుబాబులు దాడికి పాల్పడ్డారు. స్థానిక బ్రాడీపేట బైపాస్ రోడ్డు నుంచి బంగారువారి చెరువుగట్టుకు, శరవణనగర్‌కు వెళ్లే మార్గంలో ఓ బార్ అండ్ రెస్టారెంట్ ఉంది. బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో మద్యం సేవించిన కొందరు యువకులు బార్ ఎదురుగా రోడ్డుపై వెళ్తున్న డి.సత్తిబాబుపై దాడి చేశారు. ఈ సంఘటనపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సత్తిబాబు తెలిపారు.

క్లుప్తంగా

విలువలతో మంచి సమాజం



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శివాజీరావు

తాడేపల్లిగూడెం: మానవ విలువలను గుర్తించి ఆచరించిననాడే మంచి సమాజాన్ని నిర్మించగలమని పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన వర్క్‌షాపులో వక్తలు పేర్కొన్నారు. వక్తలు మాట్లాడుతూ ప్రకృతిలో అంతర్లీనంగా ఉన్న సామరస్యాన్ని అర్థం చేసుకోవడం, ఉనికిలో దాని ప్రకారం జీవించడం, అందరి శ్రేయస్సును నిర్ధారించే ప్రక్రియలను అర్థం చేసుకోవాలన్నారు. కళాశాల పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, వివిధ కళాశాలల నుంచి అసిస్టెంటు ప్రొఫెసర్లు నిధి చిరాగ్ సచాడే, శివాజీరావు, యశ్వంత్ పాటిల్ , రంగనాథ్‌జీ, కె.శేషమహేశ్వరమ్మ,లు బాట్లాడారు. 75 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్పీని కలసిన ఎమ్మెల్యే



ఎస్పీని సత్కరిస్తున్న గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు

తాడేపల్లిగూడెం: జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మిని భీమవరంలో గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో లా అండ్ ఆర్డర్ సమస్యలపై ఎస్పీతో చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీని ఘనంగా సత్కరించారు.

వైహెచ్ఏఐ రాష్ట్ర అధ్యక్షుడు సోమరాజుకు సత్కారం

భీమవరం: యూత్ హాస్టల్స్ ఉద్యమం యువతకు దిక్సూచి వంటిదని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్ఏఐ) రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ సోమరాజు అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలో బుధవారం నిర్వహించిన వైహెచ్ఏఐ భీమవరం యూనిట్ 35వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం డాక్టర్ సోమరాజును సత్కరించారు. యూనిట్ అధ్యక్షుడు మంతెన వెంకట నర్సింహ సీతారామరాజు రాజు, కార్యదర్శి నందమూరి రాజేష్, కోశాధికారి బొండా శ్రీరామ్, మల్లినీడి తిరుమలరావు, పాల్గొన్నారు.

కళ్ల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

ఉండి: వాండ్రం గ్రామంలో భీమవరానికి చెందిన కృష్ణా ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రోగులు నేత్ర వైద్య పరీక్షలు చేయించుకోగా అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కళ్ల సంరక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కంటి సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. శిబిరంలో కంటి శస్త్రచికిత్సలు అవసరమైన వారికి నిర్వాహకులు ఉచితంగా చేయిస్తారని, అవసరమైన మందులు, కళ్లజోళ్లను ఉచితంగా అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్డిపల్లి సత్యనారాయణ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రజకుల సమస్యలను పరిష్కరించాలి

వీరవాసరం: రజకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రజక సంఘ మండల నాయకులు పాలకోడేటి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. నవుడూరు పద్దాలంకమ్మ వారి ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో రజకుల చెరువులను ఇంతవరకు పూర్తి స్థాయిలో అప్పగించలేదన్నారు. 50 సంవత్సరాలు దాటిన రజకులకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వద్దిపర్తి శ్రీనివాసరావు, యండమూరి సుబ్బారావు, మండపాక కొండ, కనకం, సంఘ నాయకులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

వీరవాసరం: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. వీరవాసరం, రాయికుదురు, కొణితివాడ, మత్స్యపురి, తోకలపూడి, నవుడూరు జంక్షన్, పంజావేమవరం గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నారాయణం శ్రీనివాస దీక్షితులు, రామకృష్ణ శర్మ, కొడమంచిలి ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బడిబాట పట్టిన పేదింటి పిల్లలు

- నాడు– నేడు నిధులతో విరాజిల్లుతున్న ప్రభుత్వ పాఠశాలలు
- ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన హాజరు శాతం
- పది ఫలితాల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థుల మార్కులు
- చదువుల విప్లవం సృష్టించిన జగన్ ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



తణుకులో నాడు- నేడు నిధులతో తీర్చిదిద్దిన జెడ్పీ బాలుర హైస్కూల్



విద్యార్థులకు అందుబాటులో ఉన్న అధునాతన బెంచ్‌లు, డెస్క్‌లు

తణుకు అర్బన్: భావితరాలను విద్యావంతులు చేయడం ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందనే సదుద్దేశ్యంతో గత జగన్ ప్రభుత్వం అందరికీ చదువు అనే సంపదను అందించే క్రమంలో పేదింటి పిల్లల కోసం విద్యావిప్లవాన్ని తీసుకువచ్చారు. పేదంటి బిడ్డలంతా విద్యనభ్యసించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యాంశాల బోధన మరింత సులువు చేసే క్రమంలో ప్రభుత్వం నూతన విధానాలను, వాటికి సంబంధించిన మౌలిక వసతులను పాఠశాలలకు కల్పించింది. పిల్లలను పాఠశాలలకు పంపిస్తే సంక్షేమం అందిస్తామని చెప్పి అమలు చేశారు. దీంతో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్లుగా ఉపాధ్యాయులు చెబుతున్నారు. తణుకు ప్రాంతంలో విపరీతమైన పోటీతత్వంతో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల సంఖ్య పెరగడంతో పాటు కార్పొరేట్ పాఠశాలలు కూడా ఇతర ప్రాంతాల నుంచి తరలివస్తున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు ఢోకా లేదని తెలుస్తోంది.

మార్పు తీసుకువచ్చిన సంక్షేమం...

పేదింటి బిడ్డల విద్యాభ్యాసానికి ప్రభుత్వం అందించిన సంక్షేమం ఎంతో మార్పు తీసుకువచ్చింది. విద్యార్థిని బడికి పంపిస్తే అమ్మ ఒడి ద్వారా ఏడాదికి రూ. 15వేలు ఇస్తామని చెప్పి అమలు చేయడాన్ని తల్లి తండ్రులు హర్షిస్తున్నారు. 2019 నుంచి 2024 వరకు విద్యారంగంలో అమలుచేసిన విప్లవాత్మక మార్పుల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల సౌకర్యార్థం విద్యా కానుక పేరుతో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగ్, టై, షూస్, యూనిఫామ్ వంటి సౌకర్యాలను జగన్ ప్రభుత్వం అందజేసింది. బిడ్డల చదువు తల్లిదండ్రులపై ఒత్తిడి పడకుండా అమ్మ ఒడి, గోరు ముద్దతో ప్రభుత్వం ఆదుకుంది.

వసతుల వెల్లువ..

నాడు నేడు నిధులతో తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలను రూపురేఖలు మార్చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన ప్యూరిఫైడ్ తాగునీరు, అధునాతన సౌకర్యాలతో మరుగుదొడ్లు, భవన, ప్రహరీ నిర్మాణాలు, తరగతి గదుల్లో అధునాతనమైన బెంచ్‌లు, డెస్క్‌లు, లంచ్ రూంలు వంటివి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా స్వాగతించారు. ముఖ్యంగా ఇంగ్లీషు మీడియం బోధన, ప్రైవేటు పాఠశాలల్లో సైతం లేని డిజిటల్ సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా విద్యావిధానంలో విద్యార్థులకు డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి అభ్యసన సామర్థ్యన్ని మెరుగుపరిచేందుకు ఇంట్రాక్షన్ ఫ్లాట్ పానల్ (ఐఎఫ్‌పి) స్మార్ట్ స్క్రీన్‌లు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ స్మార్ట్ స్క్రీన్‌ల ద్వారా అంతర్జాలంలో పొందుపరిచి ఉన్న వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన అంశాలను ఉపాధ్యాయులు సులువుగా అర్థమయ్యే రీతిలో ప్రయోగాత్మకంగా విద్యార్థులకు బోధిస్తున్నారు. వీటిని మొబైల్ ద్వారా యాక్టివేట్ చేయడం, పెన్‌డ్రైవ్‌లు, ఇంటర్నెట్ ద్వారా మూడు పద్ధతుల్లో వినియోగింపజేశారు. అంతేకాకుండా 8వ తరగతి విద్యార్థులందరికీ ప్రభుత్వం ఉచితంగా ట్యాబ్‌లు అందజేసింది. ఇలా కార్పొరేట్ పాఠశాలల్లో లేని విద్యా సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యక్షమవ్వడంతో విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగపరచుకున్నారు.

నియోజకవర్గంలో విద్యారంగానికి సంక్షేమం ఇలా...

పథకం	విద్యార్థుల సంఖ్య	మొత్తం
జగనన్న అమ్మ ఒడి	25,743	రూ. 172.74 కోట్లు
నాడు– నేడు	140	రూ. 149.53 కోట్లు
జగనన్న విద్యా కానుక	19,164	రూ. 13.68 కోట్లు
జగనన్న వసతి దీవెన	6,168	రూ. 26.61 కోట్లు
జగనన్న విద్యాదీవెన	6,132	రూ. 69.58 కోట్లు

మెరుగైన పది ఫలితాల శాతం..

తణుకు నియోజకవర్గంలో ఈ ఏడాది పది పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 72 శాతంతో ఉత్తీర్ణులయ్యారు. ముఖ్యంగా ఇంగ్లీషు మీడియంలో 82 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, తెలుగు మీడియంలో 57 శాతం ఉత్తీర్ణత సాధించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్తిలి హైస్కూల్ విద్యార్థి సీహెచ్ రేవంత్ కుమార్ 590 మార్కులు సాధించి జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించగా, అత్తిలి గరల్స్ హైస్కూలు విద్యార్థిని ఎస్‌వీఏస్ఎస్ త్రివేణి 582 మార్కులు, తణుకు జాస్తి సీతా మహాలక్ష్మి బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కేఎస్ కార్తికేయని 581 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలో సత్తా చాటారు.

నియోజకవర్గంలో నాడు –నేడు నిధులు రూ. 149.53 కోట్లు..

తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి మొత్తం 163 పాఠశాలలు ఉండగా నాడు నేడు పథకంలో భాగంగా 140 పాఠశాలలను రూ. 149.53 కోట్లు నిధులతో అభివృద్ధి చేశారు. పాఠశాలల్లో వసతులు పెరగడంతోపాటు అమ్మ ఒడి రూపంలో తల్లి దండ్రుల ఖాతాల్లో ప్రతి ఏడాది రూ. 15వేలు నగదు జమకావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. నియోజకవర్గంలో 2018–19లో విద్యార్థుల సంఖ్య 14,489 ఉండగా 2024 సంవత్సరానికి గాను ఆ సంఖ్య 15,811కు పెరిగింది.

ముగిసిన బ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలు



పెంటపాడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద అన్న సమారాధన దృశ్యం

పెంటపాడు: మండలంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఉత్సవాలు ముగింపు సందర్భంగా పెంటపాడు గ్రామ విశ్వబ్రాహ్మణసంఘ భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 4 వేల మంది భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ



చిన్నారులకు విద్యా సామగ్రి అందజేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 32వ వార్డు కడకట్లలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం 30 మంది చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికిరణ్, నున్న ఆనంద్, గుప్తాలు మాట్లాడుతూ చక్కని చదువులు చదివిన వారికి వాసవి క్లబ్ తోడుగా ఉంటుందని, ప్రోత్సాహక బహుమతులు, ఇతర సేవలు అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

తొలి ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గేశ్వరీ అమ్మవారు



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

పెంటపాడు: తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో ఉత్సవ శోభ వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరం, ప్రత్తిపాడు వై.జంక్షన్ కనకదుర్గమ్మ, రావిపాడు కనకదుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మ ప్రచార పరిషత్ మాజీ సభ్యురాలు కొండ్రెడ్డి హైమావతి స్వగృహం వద్ద కృష్ణపరమాత్మ, లక్ష్మీనారాయణలకు ప్రత్యేక పూజలు, భగవద్గీత పారాయణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తొలి ఏకాదశి సందర్భంగా రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో కృష్ణ పరమాత్మకు, చింతామణిదేవి అమ్మవారికి, అభయ గణపతికి, భక్తాంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర నామ పూజలు జరిగాయి. అలాగే స్థానిక హౌసింగ్‌బోర్డులో అభయ ఆంజనేయస్వామికి భక్తులు 58 వెండి తమలపాకులు బహుకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

శాకంబరిగా విశ్వ దుర్గేశ్వరీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆషాడ మాసం తొలి ఏకాదశి సందర్భంగా స్థానిక 17వ వార్డులో శాకంబరిగా విశ్వ దుర్గేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులచే సారె మేళ తాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా వరాల వెంకన్నకు అభిషేక పూజలు

అత్తిలి: మండలంలోని ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా విశేష అభిషేక పూజలు ఘనంగా జరిపారు. బుధవారం ఉదయం 700 లీటర్ల ఆవుపాలు, 10 లీటర్ల పెరుగు, 7 కేజీల ఆవునెయ్యి, 7 కిలోల పసుపు, 7 కిలోల తేనె, 7 కిలోల కుంకుమ, 7 కిలోల తెల్ల ఆవాలు, 7 కిలోల వట్టివేళ్లతో ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులుహాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అత్తిలి రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సేవా కార్యక్రమాలు అభినందనీయం

తణుకు టౌన్: పాస్టర్స్ ఫెలోషిప్ నిర్వహిస్తున్న సమాజ సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చేతుల మీదుగా ఈ సర్టిఫికెట్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్ మంజూరైనట్లు మండల పాస్టర్స్ ఫెలోషిప్ వరిగేటి మనోజ్‌బాబ్ తెలిపారు. గత 30సంవత్సరాలుగా తణుకు పరిసర గ్రామాల్లో పాస్టర్స్ ఫెలోషిప్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు గానూ ప్రతిష్ఠాత్మక ఐఎస్‌వో 9001–2015 సర్టిఫికెట్ లభించినట్లు తెలిపారు. దీనితో పాటు ముంబాయి ఇన్‌కాం టాక్స్ కమీషనర్ కార్యాలయం నుంచి 12ఏ, 80జీ సర్టిఫికేట్లు పొందడం జరిగిందన్నారు. దీని ద్వారా తమ సేవా కార్యక్రమాలకు విరాళాలు ఇచ్చే దాతలకు తమ ఇన్‌కాం టాక్స్ (ఆదాయ పన్ను)లో 50 శాతం రాయితీ సదుపాయం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె లాజరస్‌బాబు, కార్యదర్శి కె బ్లెస్సింగ్ రాజు, సహాయ కార్యదర్శి కె సోమరాజు, కోఆర్డినేటర్ పి ఐజాక్ బెన్హామ్, సభ్యులు ఎస్ కృపావర, డీ వర్మ తదితరులు పాల్గొన్నారు.



ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఫెలోషిప్ నాయకులు

వేల్పూరులో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని విష్ణుప్రియ నగర్‌లో రూ. 60 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ శంకుస్థాపన చేశారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.60 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి, ఉప సర్పంచ్ గుణ్ణం రాజారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి సునంద, బీజేపీ నియోజవకర్గ కన్వీనర్ ఐనంపూడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పీర్ల ఊరేగింపు

పెనుగొండ: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని వడలిలో గురువు సజ్జాద్ తనయుడు రియాజ్ పయాజ్ ఆధ్వర్యంలో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. బుధవారం పిట్టల వేమవరం రోడ్డు నుంచి పోతురాజు గుడి వరవద్ద నాగూర్ మీరా సాహెబ్ సంబరం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. గత 56 సంవత్సరాలుగా గౌడ సంఘం ఆధ్వర్యంలో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తూ మత సామరస్యాన్ని, ఐక్యతను చాటుకుంటున్నారు. పీర్ల ఉత్సవంలో భాగంగా నిప్పుల గుండం తొక్కారు. శనివారం అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు.

పండ్లు, బ్రెడ్ పంపిణీ

పెనుగొండ: ప్రతి ఒక్కరూ సేవా మార్గంలో నడవాలని మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ అధ్యక్షుడు డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు అన్నారు. బుధవారం పెనుగొండ ఎస్ఆర్‌కే విల్లాలో మండ ప్రసాద్ దంపతుల సహకారంతో పేదలకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు.

పంచాయతీ వద్ద వాటర్ ప్లాంట్ ఏర్పాటు



నందమూరు పంచాయతీ కార్యాలయం వద్ద వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ వరలక్ష్మి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నందమూరు పంచాయతీ కార్యాలయం వద్ద వాటర్ ప్లాంట్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వరలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించే లక్ష్యంతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్వాయిన్ సిస్టమ్ ద్వారా పనిచేస్తుందన్నారు. రూపాయికి నాలుగు లీటర్లు, రెండు రూపాయలకు ఎనిమిది లీటర్లు, రూ.5లకు 20 లీటర్లు లభిస్తాయన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పని చేస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కూటమి నాయకులు శనగన రాంబాబు, దార్లంక రాము, తాతకుంట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసర వస్తువుల పంపిణీ



వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వల్లి, మోహన్ యువజన సేవా సమితి సేవలను మరింతగా విస్తృతంగా ముందుకు తీసుకువెళ్లాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక పాతూరు మసీద్ సెంటర్‌లో బుధవారం సేవా సమితి వారి ఆధ్వర్యంలో నూతన కార్యాలయాన్ని కమిషనర్ డి.మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నిరుపేద వృద్ధులకు 20 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్‌వల్లి, సమితి అధ్యక్షుడు అడపా తిలక్, కార్యదర్శి గొల్లేరు మోహన్, ఉద్రాజవరపు భాస్కర్, మెంటే రాంబాబు, గాంధీ మండపం అభివృద్ధి కమిటీ కార్యదర్శి దుర్గా రామచంద్రరావు, సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా ఏళ్ల తరబడి పిల్లలకు సేవలు అందిస్తున్నా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రస్తుతం కార్మికులకు ఇస్తున్న రూ.3 వేలు జీతాన్ని ధరల పెరుగుదలకు అనుగుణంగా పెంచాలని, మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్ సిలిండర్స్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. మదీనా బేబీ అధ్యక్షత వహించారు. శాంభాని దుర్గ, పాండ్రంగి రాము పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రీచార్జి ధరలను తగ్గించాలి

పోడూరు: పెంచిన సెల్‌ఫోన్ రీఛార్జి ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం కార్యదర్శి బొంతు శ్రీను డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బల్ల వంతెన వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ప్రజలపై మోయలేని భారాన్ని వేస్తుందన్నారు.

నేడు హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ

పాలకొల్లు సెంట్రల్: రహదారులపై ప్రయాణించే ప్రతి ద్విచక్రవాహనదారుడూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలో ఉదయం 9 గంటలకు కోర్టు ప్రాంగణం నుంచి గాంధీబొమ్మల సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించనున్నట్లు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ ర్యాలీలో హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని, న్యాయవాదులు, కళాశాల విద్యార్థులు, పోలీసులు తదితరులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

భీమవరం: ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దాతల సహకారం ఎప్పుడూ ఉంటుందని కేంద్ర ఉక్కు, గనులశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గణపవరం మండలానికి చెందిన అల్లూరి జయారమ్యశ్రీ కళాశాల ఫీజు చెల్లించే నిమిత్తం బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రూ.30 వేలు సమకూర్చగా ఆ మొత్తాన్ని బుధవారం విద్యార్థినికి అందించిన సందర్భంగా శ్రీనివాసవర్మ మాట్లాడారు. జయారమ్యశ్రీ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో 577 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. మెరిట్ విద్యార్థుల ఉన్నత చదువులకు దాతలు మరింత సహకారం అందిస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసవర్మ ఆకాంక్షించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

పెనుగొండ: గ్రామాల అభివృద్ధికి, వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రారంభించిన ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి అన్నారు. బుధవారం పెనుగొండ పంచాయతీ ఆవరణలో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నారు. 11 నుంచి నేటి వరకూ నిర్వహించిన సామాజిక తనిఖీల్లో మూడు ఫిర్యాదులు పింఛన్లపైనా, నాలుగు అభ్యంతరంలో మాస్టర్ ఫీట్‌లో రావడంతో వాటిని చర్చించి పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ దొర, సామాజిక తనిఖీ మండల పరిశీలకుడు ఎంఈఓ డి.శుభాకరరావు, ఎస్ఆర్‌పీ ఎం.గోవింద, డీఆర్‌పీ టి.నాగరాజు, గ్రామ కార్యదర్శి టి.రత్నాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నారుమడుల పరిశీలన

మొగల్తూరు: నారుమడుల్లో చేరిన నీటిని తొలగించి తగు జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు మొగల్తూరు, రామన్నపాలెం గ్రామాల్లో నీట మునిగిన నారుమడులను బుధవారం ఆయన పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మడుల్లో వర్షపు నీటిని తొలగించి నారుపై రెండు గ్రాముల కార్బండిజమ్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నారుమడులు వేయడం ఆలస్యమైనా లేదా సాగు పనులు చేపట్టడం ఆలస్యమైనా ఇప్పటి వరకు నారుమడులు వేయని రైతులు వెదజల్లే పద్ధతిని పాటించాలని ఆయన సూచించారు. ఎకరాకు 12 నుంచి15 కేజీల విత్తనాలు సరిపోతాయని వివరించారు.